
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5




వనపర్తి

జిల్లా వార్తలు

శుక్రవారం 18 జూలై 2025

ఎన్నెన్ని అందాలో..



అమరగిరిలో కృష్ణానది

కృష్ణమ్మ పరవళ్లు ఓపక్క కనువిందు చేస్తుండగా.. పచ్చటి నల్లమల అందాలు అబ్బుర పరుస్తున్నాయి. కొల్లాపూర్ మండల పరిధిలోని 8 కిలో మీటర్ల దూరంలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచిన అమరగిరిలో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణానది అందాలను తిలకించేందుకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు రెండు కళ్లు సరిపోవడం లేదు.

- కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి

క్లిక్.. క్లిక్..



అమరగిరిలో అబ్బురపరుస్తున్న పచ్చటి అందాలు

వరాల జల్లు కురి సేనా?



- నేడు పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌కు సీఎం రాక
- రూ.200కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ



జటప్రోలులో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



సీఎం బహిరంగ సభా స్థలంలో ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్/పెంట్లవెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం జిల్లాలోని పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆయన శంకుస్థాపన చేయ నున్నారు. దాదాపు 200కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న భవన సముదాయానికి పెంట్లవెల్లి మండలం జటప్రోల్ మదనగోపాలస్వామి ఆలయం ఎదుట 24ఎకరాల్లో దీన్ని నిర్మించనున్నారు. మొదటిసారి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. దాదాపు 30 వేల నుంచి 50 వేల మందిని సమీకరించి బహిరంగ సభను

- మిగతా 6లో..

● సీఎం షెడ్యూల్ ఇదే...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేగంపేటలోని విమానాశ్రయం నుంచి ఒంటిగంటకు హెలికాప్టర్‌లో బయలేదేరి 1:45గంటలకు జటప్రోల్‌కు చేరుకుంటారు.

అక్కడి మదనగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించుకున్న అనంతరం 2:10గంటలకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మదనగోపాలస్వామి ఆలయం ముందు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి రాక కోసం దోసకాయలపేట వద్ద హెలి ప్యాడ్‌ను ఏర్పాటు చేశారు.

ఇక బ్రహ్మగిరి, కృష్ణగిరి

- దోమలపెంట, ఈగలపెంట పేర్లు మారుస్తూ అధికారిక ప్రకటన
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

6



బ్రహ్మగిరిగా పేరు మార్పు ఫ్లెక్సీని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- పెళ్లయిన 6 నెలలకే మృత్యు ఒడిలోకి..
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రామాంజనేయులు(ఫైల్)

అలంపూరు చౌరస్తా/గట్టు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పెళ్లయిన ఆరు నెలలకే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టు మండలంలోని గోర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు (25), కుర్వ నరసింహులు తమ స్నేహితులను కలిసేందుకు బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై కర్నూలుకు వెళ్లారు. అదే రోజు రాత్రి పొద్దుపోయాక తిరుగు ప్రయాణమయ్యారు. కర్నూలు చెక్ పోస్టు దాటాక ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న స్కూటీ వీరి బైక్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు నరసింహ, స్కూటీపై వచ్చిన కర్నూలు వాసులు అరుణ్, శశి గాయపడ్డారు. వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చందు నాయక్‌కు కన్నీటి వీడ్కోలు

- నర్సాయిపల్లిలో అంత్యక్రియలు 6

ప్రజల సహకారంతో శాంతి భద్రతలు

- డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ 6

లింగ నిర్ధారణ పరీక్షలపై విచారణ

6

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

దెబ్బకు దిగొచ్చారు..

- చీటింగ్ కేసు పెడతామని హెచ్చరించిన కలెక్టర్
- ఉత్పత్తులను కొంటామని హామీ ఇచ్చిన సీడ్ కంపెనీలు
- రెండు రోజుల ధర్నాతో విజయం సాధించిన రైతులు



కంపెనీలు ఇచ్చిన హామీని రైతులకు వివరిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జూలై 17(ఆంధ్రజ్యోతి) రైతులను మోసం చేస్తే చీటింగ్ కేసులు పెడుతామని కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులు హెచ్చరించడంతో పత్తి విత్తనోత్పత్తి కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు దిగి వచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కంపెనీలు తాము ఇచ్చిన సీడ్‌తో ఉత్పత్తి అయ్యే మొత్తం పంటను కొనుగోలు చేస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. రెండు రోజులుగా ధర్నా నిర్వహిస్తున్న సీడ్ పత్తి రైతులు విజయం సాధించారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది సీడ్ పత్తి విత్తనోత్పత్తిని 50వేలకు పైగా ఎకరాలలో సాగు చేశారు. ఇందుకోసం 36 సీడ్ కంపెనీలు తమ ఆర్గనైజర్ల ద్వారా విత్తనాలు సరఫరా చేశారు. రెండు నెలలుగా రైతులు పత్తి మొక్కలను సంరక్షించి పూత దశకు తీసుకవచ్చారు. ఎకరాకు రూ.50వేలకు పైగా పెట్టుబడి అయ్యింది. ఈ సమయంలో ఎకరాకు రెండు క్వింటాళ్లను మాత్రమే తీసుకుంటామని కండీషన్ పెట్టడం, లేదంటే వేసిన పంటలో కొంత తొలగించుకుంటే రూ.10వేల వరకు పరిహారం ఇస్తామని సూచించడంతో రైతులు ఆగ్రహించారు. కంపెనీ ప్రతినిధులను, ఆర్గనైజర్లను నిలదీశారు. దిగిరాకపోవడంతో ధర్నాకు పిలుపునిచ్చారు. గద్వాల- అయిజ రోడ్డుపై బుధవారం దాదాపు ఐదు గంటల పాటు ధర్నా నిర్వహించారు. వీరికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి, బీఆర్ఎస్, బీజేపీలు మద్దతు తెలిపారు.

దీంతో కలెక్టర్, ఎస్పీ సందించి కంపెనీలు, ఆర్గనైజర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు.

కేసులు పెడుతామని హెచ్చరించిన కలెక్టర్

కలెక్టరేట్‌లో కంపెనీలు, ఆర్గనైజర్లతో కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ జేడీ సుచరిత, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఏవో సక్రియనాయక్‌లు సమావేశం అయ్యారు. మొదట జిల్లా కలెక్టర్ కంపెనీల ప్రతినిధులతో ఎన్ని ఎకరాలకు సీడ్ ఇచ్చారో జాబితా తీసుకోగా 36కంపెనీలు 40వేల ఎకరాలుకు పైగా ఇచ్చినట్లు తేలింది. ఇంకా 16 కంపెనీలు సమావేశానికి రాలేదు. వారి వద్ద దాదాపు 10వేల నుంచి 15వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు తేలింది. ఇన్ని వేల ఎకరాలలో సాగుకు సీడ్ అందించి పూత దశలో కొనుగోలు చేయలేమని చెబితే రైతు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది రైతులను మోసం చేసినట్లు అవుతుంది. తప్పక మీపై చీటింగ్ కేసు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో కంపెనీల ప్రతినిధులు దిగివచ్చారు. మొత్తం సీడ్ ఉత్పత్తిని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో కలెక్టర్ వారితో లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు. ఆ తర్వాత కంపెనీల ఎండీలతో లిఖిత పూర్వక హామీ, రైతులకు ఇచ్చిన సీడ్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. ఒకపక్క వీరితో సమావేశం జరుగుతుండగానే వందలాది మంది రైతులు కలెక్టరేట్ గేటు ముందు ధర్నా నిర్వహిస్తూనే ఉన్నారు. సమావేశంలో రైతులకు భాగస్వామ్యం కావాలని పట్టుబట్టారు. దాదాపు రెండు గంటల తర్వాత కలెక్టర్ రైతులందరిని కలెక్టరేట్‌లోని గ్రీన్‌లాన్‌లోకి పిలిపించి అందరి సమక్షంలో కంపెనీలు ఇచ్చిన హామీని ప్రకటించారు. రైతులు సంతోషం వెలిబుచ్చినప్పటికీ వారిలో మిగిలిపోయిన సందేహాలను ప్రశ్నించారు. కానీ అధికారులు వాటికి సమాధానం చెప్పకుండానే తిరిగి వెళ్లిపోయారు. ధర్నాలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ రంజిత్ కుమార్, కో కన్వీనర్ బుచ్చిబాబు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వపల్లయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అక్కల రమాసాయిబాబ, బండల వెంకట్రాములు, సీఐటీయూ నర్సింహులు ఉన్నారు.

చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- రాష్ట్ర పశు సంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి, పక్కన మల్లురవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేపల ఉత్పత్తిలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశా కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దిశా కమిటీ సభ్య కార్యదర్శి కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 82 కోట్ల చేప పిల్లలను వదలబోతున్నామని, ఆ తరువాత వాటి ఉత్పత్తి చేసి కోల్డ్ స్టోరేజ్ లోను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వనపర్తి నియోజకవర్గానికి క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు మినీ స్టేడియాలు, స్పోర్ట్స్ పాఠశాలలు కేటాయించాలని శాసన సభ్యుడు మేఘారెడ్డి మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. దిశా కమిటీ చైర్మన్ మల్లు రవి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు అయిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనతో పాటుగా అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజలందరికీ చేరువ చేసే విధంగా బ్యాంకర్లు పని చేయాలని సూచించారు. జిల్లా భూగర్భ జల శాఖ అధికారి సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల షోకాజ్ నోటీసులు జారీ చేయమని కలెక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల విషయంలో అధికారులు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు యాదయ్య, వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో ఉమాదేవి, జిల్లా అటవీశాఖాధికారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, దిశ కమిటీ సభ్యులు ధనలక్ష్మి, శంకర్ నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో పట్టుకున్నా..

ఫిర్యాదుకు నిరాకరణ

- ఆధారాలు లేవంటూ నివేదిక ఇచ్చిన సివిల్ సప్లయ్ అధికారులు



రెండు రోజుల క్రితం చెక్‌పోస్టు వద్ద గ్రామస్థులు పట్టుకున్న ధాన్యంతో ఉన్న లారీ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

గద్వాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా నందిన్నె చెక్‌పోస్టు ద్వారా రాయిచూర్‌కు తరలిస్తున్న సీఎంఆర్ ధాన్యాన్ని గ్రామస్థులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. రెండు లారీలను చెక్‌పోస్టు అధికారులకు అప్పగించారు. ఆ తర్వాత కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీఎస్‌వో స్వామికుమార్ విచారణలో చెక్‌పోస్టు అధికారులు ఫిర్యాదు చేసేందుకు, పంచనామా ఇవ్వడానికి నిరాకరించారని, అదేవిధంగా చెక్‌పోస్టుగుండా లారీలు వెళుతున్నాయని గ్రామస్థులు పట్టుకున్నారన్న దానికి ఆధారాలు లేవని నివేదిక ఇవ్వడం కొసమెరుపు. దీని కి వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తున్నది.

గ్రామస్థులు పట్టించినా ఆధారాలు కావాలా..?

కేటీదొడ్డిలోని ఓ రైస్‌మిల్లుకు భారీగా సీఎంఆర్ ధాన్యం కేటాయించారు. ఇందులో గత రెండు ఖరీఫ్‌లతో పాటు రబీకి సంబంధించిన ధాన్యం కూడా ఉంది. ఈ మిల్లు యజమాని సీఎంఆర్ రూపంలో పెద్ద సంఖ్యలో బాకీ పడ్డారు. కర్ణాటక సరిహద్దుకు సమీపంలో ఉండటంతో సులభంగా తరలించేందుకు వీలుఉంది. దీంతో ప్రతిసారి రైస్ మిల్లునుంచి లారీలు చెక్‌పోస్టు గుండా రాయిచూర్‌కు తరలిపోడాన్ని గ్రామస్థులు గమనించుకుంటూ వచ్చారు. సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులలో చలనం లేకపోవడంతో గ్రామస్థులే ఈసారి రంగంలోకి దిగారు. మంగళవారం అర్ధరాత్రి రెండు లారీలకు ధాన్యం ఎత్తుతుండగా సమాచారం అందింది. దీంతో వాళ్లు చెక్‌పోస్టు వద్దకు చేరుకొని తెల్లవారుజామున 3గంటలకు రెండు లారీలు రాగా వాటిని పట్టుకున్నారు. చెక్‌పోస్టు అధికారులకు అప్పగించారు. కానీ ఇందులో ఒకటి చెక్‌పోస్టు అధికారుల కళ్లుగప్పి తప్పించుకుపోయింది. ఇందులో సీఎంఆర్‌కు సంబంధించిన బియ్యం ఉన్నట్లు తెలిసింది. మరో దానిని ఉదయం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు.

విచారణలో 2800 బస్తాలు తేలాయి

కేటీదొడ్డిలోని మిల్లుపై ఫిర్యాదు రావడంతో విచారణ నిర్వహించాం. మేము వెళ్లినపుపడు ధాన్యం లారీ మిల్లు బయట ఉంది. చెక్‌పోస్టు అధికారులు ఫిర్యాదు చేయడానికి, పంచనామా నిర్వహించడానికి నిరాకరించారు. దీంతో ఆధారాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. మిల్లులో ధాన్యం లెక్కించగా కేటాయించిన సీఎంఆర్ కంటే 2800 బస్తాలు మాత్రమే తక్కువగా ఉంది. దానిపై నివేదికను అదనపు కలెక్టర్‌కు నివేదించాం.

- స్వామి కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

తరలింపునకు ఆధారాలు లేవంటూ నివేదిక

గ్రామస్థులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశం మేరకు డీఎస్‌వో స్వామి కుమార్ విచారణకు వెళ్లారు. అయితే ఆయన విచారణ కొత్త మలుపు తిరిగింది. వాళ్లు వెళ్లినపుడు లారీ రైస్ మిల్లు బయట ఆగి ఉందని, దానిని పోలీస్ స్టేషన్‌కు తరిలించగా ఫిర్యాదు చేస్తేనే లారీని స్టేషన్ ఆవరణలో ఉంచుతానని ఎస్సై చెప్పినట్లు నివేదించారు. అయితే ఫిర్యాదు ఇవ్వడానికి ఆధారాలు లేవని, ఇవ్వలేమని సివిల్ సప్లయ్ అధికారులు చెప్పడంతో ఆయన దానిని తిప్పి పంపించారు. లారీని చింతలకుంటలోని రైస్ మిల్లుకు తరలించి అక్రమంగా ధాన్యం తరలించిన మిల్లులో విచారణ చేశారు. రెండు సీజన్లలో 3.90లక్షల బస్తాల ధాన్యం కేటాయించగా కేవలం 2800 బస్తాలు మాత్రమే తక్కువగా ఉన్నట్లు తేల్చారు. అది కూడా మిల్లుది తప్పు కాదని కేటాయించిన ధాన్యం తేమ శాతం కోల్పోవడంతో మిల్లులో తక్కువ కనిపిస్తుందని నివేదించడం కొసమెరుపు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

బీఆర్ఎస్ జెండా ఎగరాలి

- తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ వల్లే సాధ్యం
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజవర్గంలోని ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాల్సిన సందర్భం వచ్చిందన్నారు. నియోజవర్గంలోని మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు సభ్యులను గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంత ఘోరంగా విఫలమైందో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎప్పుడూ కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని కొందరు అధికారులు అతిగా వ్యవహరిస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, వారు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రతీ కార్యకర్త ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరపున పోరాటం చేస్తానని మర్రి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నాగం శశీధర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు



నిందితులతో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేష్

వంగూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు పోలీస్‌స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన కొరపాల రేణయ్య తన కారు నెంబరు కనిపించకుండా ప్లేట్‌కు బురద పూశాడు. తన అల్లుడు, ఉప్పునుంతుల మండల కేంద్రానికి చెందిన బల్లుల అంజనేయులు, అతడి స్నేహితుడు మోగిలి అంజనేయులు కలసి కారులో బయలుదేరాడు. రంగాపూర్ శివారులో పొలం నుంచి ఒంటరిగా ఇంటికి వెళ్తున్న మహిళ వద్ద కారు ఆపారు. అంజనేయులు కిందకు దిగి ఆమె మెడలో ఉన్న నల్లపూసల దండను లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేశ్ తెలిపారు.

ఐదు ట్రాక్టర్లపై కేసు

» ఎంవీఐ వాసుదేవ రావు

పెబ్బేరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా వెళ్తున్న 5 ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎంవీఐ వాసుదేవరావు తెలిపారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి గ్రామ సమీపంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తున్న 5 ఇసుక ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్లకు లైసెన్సులు, ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లను సీజ్ చేశారు.

పోక్సో కేసులో దోషికి జీవిత ఖైదు

» రూ.10 వేల జరిమానా

మహబూబ్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో ఓ వ్యక్తికి న్యాయాధికారి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండలంలోని గాదిర్యాలకు చెందిన జిలకరపురం కృష్ణయ్య 2016లో 15 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో మహ్మదాబాద్ పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, చార్జిషీటు దాఖలు చేశారు. శుక్రవారం అతడిని మహబూబ్‌నగర్ ప్రత్యేక సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. అతడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి సీఐ బి కిషన్, హెడ్‌కానిస్టేబుల్ ఉపేంద్రలను, అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి, ప్రస్తుత పోలీస్ అధికారులు సీఐ గాంధీనాయక్, మహ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి, ఏఎస్ఐ బాలకృష్ణ, కోర్టు డ్యూటీ అధికారులు కృష్ణ, రహీమ్, శంకర్‌లను ఎస్పీ జానకి అభినందించారు.

చందు నాయక్‌కు కన్నీటి వీడ్కోలు

» నర్సాయిపల్లిలో అంత్యక్రియలు

బల్మూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందునాయక్‌కు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని, మలక్‌పేట పరిధిలో ఉన్న శాలివాహననగర్ పార్కు వద్ద మంగళవారం ఆయన హత్యకు గురయ్యాడు. బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని ఆయన స్వగ్రామం నర్సాయపల్లికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు టీజీ నరసింహ మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం కష్టపడిన నాయకుడు చందునాయక్ అన్నారు. రాష్ట్ర నాయకులు గెలువయ్య, శ్రవణ్‌కుమార్, శంకర్‌నాయక్, దేశ్యానాయక్‌లు మాట్లాడుతూ చందునాయక్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, మలక్ పేట, శాలివాహనగర్, సాయినగర్ ప్రాంతాల నుంచి కార్మికులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో గ్రామానికి తరలివచ్చారు.



చందునాయక్ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

మినీ ట్యాంక్‌బండ్‌లో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన క్యాతరమోని నాగరాజు (30) త్రిశూల్‌నగర్ సమీపంలోని మినీ ట్యాంక్‌బండ్‌లో పడి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు భార్య రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన అతడు అప్పుడప్పుడు చెప్ప కుండా వెళ్లిపోయి వారం రోజులకు తిరిగి వచ్చేవాడు. అలాగే ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిన నాగరాజు ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం మినీ ట్యాంకుబండ్‌లో ఆయన మృతదేహం కనిపించింది. సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్దకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ ఎస్ఐ నందీకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్ (50) ఈనెల 12న ద్విచక్రవాహనంపై గద్వాలకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా మల్దకల్‌లోని రైస్ మిల్లు సమీపంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.



వెంకటేశ్ (ఫైల్)

ప్రజల సహకారంతో శాంతి భద్రతలు

» డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్

వెల్దండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని జోగుళాంబ గద్వాల్ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ, సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి, సమస్యలను ఆరాతీశారు. ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. యువతీ యువకులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. వాహనాలు నడిపేవారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆయన వెంట సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి ఉన్నారు.

వరాల జల్లు కురిసేనా?

(5వ పేజీ తరువాయి)

నిర్వహించాలని యోచిస్తున్నారు.



జటప్రోల్ గ్రామంలో సీఎం సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు

కొల్లాపూర్ సంస్థానంలో సమస్యలు ఎన్నెన్నో...

గతంలో కౌన్ ఫూస్తా కొల్లాపూర్ సంస్థాన్ అనే నానుడి ఉన్న ఈ నియోజకవర్గంలో పట్టణాభివృద్ధి విషయంలో కృషి జరిగినా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేసే ఉన్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో 34వేల 422 ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇందులో సింహభాగం 33వేల 523.7ఎకరాల్లో కొల్లాపూర్‌లోనే మామిడి పంట సాగవుతుంది. సురభి రాజుల కాలం నుంచి కొల్లాపూర్ మామిడి దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పండిస్తున్న బేనీషాన్, తోతాపరీ, రాణిపసంద్, దిల్‌పసంద్ రకాలకు దేశ విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉన్నది. మార్కెటింగ్ సౌకర్యం లేక మామిడి రైతులు కుదేలవుతున్నారు. ప్రతీ ఏటా దళారుల చేతిలో మోసపోతూ కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు పెంట్లవెల్లి మండలం రామాపూర్ వద్ద స్థల సేకరణ జరిగిన కార్యాచరణకు నోచుకోలేదు. దీంతో తమకు మంచి మార్కెటింగ్ వ్యవస్థ కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తే తమ దశ మారినట్టేనని ఈ ప్రాంత రైతాంగం ఎన్నో ఆశలు పెట్టుకుంది.

సభకు భారీ బందోబస్తు

కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నేతృత్వంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎస్పీ గత మూడు రోజుల నుంచి సీఎం సభ భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు. సీఎం సభకు 805 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొనున్నారు.

వీరిలో 3 అడిషనల్ ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 29 మంది సీఐలు, 87 మంది ఎస్ ఐలు 140 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 299 మంది కానిస్టేబుళ్లు, 134 మంది మహిళా కానిస్టేబుళ్లు, 104 మంది హోంగార్డులు సీఎం సభలో విధులు నిర్వహించనున్నట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నిర్వాసితుల గోడును పట్టించుకుంటారా?

కొల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీశైలం నిర్వాసితుల గోడు కూడా ప్రధానంగా ఉంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపు 2000మంది నిర్వాసితులుగా మారారు. వారికి ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని దాదాపు 20ఏళ్ల క్రితం హామీ ఇచ్చినా పూర్తిస్థాయిలో నెరవేరలేదు. నిర్వాసితులుగా మారిన వారి ఇళ్లల్లో పిల్లల వయో పరిమితి ఉద్యోగ అర్హతను కోల్పోతున్న పట్టించుకోవడం లేదని విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కూడా నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని ఇచ్చిన భరోసా ఎన్నికల హామీగానే మిగిలిపోవడంతో కనీసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలోనైనా తమకు ఏదైనా భరోసా వస్తుందనే ఆత్మవిశ్వాసంతో శ్రీశైలం నిర్వాసితులు ఉన్నారు. 2022లో పీసీసీ అధ్యక్షుని హోదాలో కొల్లాపూర్‌లో బహిరంగ సభ నిర్వహించిన రేవంత్‌రెడ్డి మాదాసి కుర్వలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇస్తామని భరోసానిచ్చారు. దీనిపై కూడా క్లారిటీ వస్తుందని మాదాసి కుర్వలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మత్స్యకారుల శ్రమ దోపిడీకి అడ్డుకట్ట పడేనా?

మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ప్రారంభమైన తర్వాత కృష్ణానదితో పాటు ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టుతో సహా దాదాపు 215 చెరువుల్లో మత్స్య సంపద 11వేల 48మెట్రిక్ టన్నులకు చేరింది. ఇక్కడ దోపిడీని అరికట్టడం దళారులను నియంత్రించడంలో ప్రత్యేకమైన వ్యవస్థ లేకపోవడంతో మత్స్యకారులకు సంకటంగా మారింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యేకమైన నిర్ణయం తీసుకుంటే తమ జీవితాలు మెరుగుపడుతాయనే ఆలోచన మత్స్యకారుల్లో ఉంది. ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసిన విధంగా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేపలను కొనుగోలు చేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు తరలిస్తే తమ శ్రమకు తగిన ఫలితం దక్కుతుందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

సాగునీటిపై బెంగ

సుదీర్ఘకాలం పాటు కరువుకు ఆనవాళ్లమై వలసలకు కేంద్ర బిందువైన నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగునీటి అంశం కొంత ప్రోత్సాహకరంగా ఉన్నా పూర్తిస్థాయిలో నీరందించగలిగితే మరింత మెరుగుపడుతామనే ఆలోచన చిన్న సన్నకారు రైతుల్లో ఉంది. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో దాదాపు 4 లక్షల 60వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా వివిధ కారణాలతో చెరువులు, కుంటల కింద మాత్రమే 2లక్షల పైచిలుకు ఎకరాలకు నీరందుతుంది. మెట్ట ప్రాంతానికి ఆయకట్టు స్థిరీకరణ చేసి నీరందించాల్సి ఉండగా కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ లేక పూర్తిస్థాయిలో రైతాంగానికి ప్రయోజనం చేకూరడం లేదు. కేఎల్ఐలో 3,5వ మోటారును వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అనేక ఆటుపోట్లను అన్నదాతలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కూడా ఆశాజనకంగా లేకపోవడం పట్ల అన్నదాతల్లో అసంతృప్తి వెల్లడవుతుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా డిండికి నీరందించే క్రమంలో ఎంజీఎల్ఐలో భూములు కోల్పోయిన రైతులు మరోమారు కూడా నిర్వాసితులుగా మారాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. వాస్తవానికి నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి వట్టెం రిజర్వాయర్ దాకా ఎలాంటి ఆయకట్టు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద లేకపోయినా స్థానికంగా భూగర్భ జలాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయనే క్రమంలో రైతాంగం సహకరిస్తున్నది. రెండవ సారి భూమి కోల్పోతున్న వారికి నష్ట పరిహారం చెల్లించే విషయంలో వెసులుబాటు కల్పించకపోవడం పట్ల అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది.

తపాలా శాఖలో 'ఐటీ -2.0'

» 22వ తేదీ నుంచి కొత్త సాఫ్ట్‌వేర్ అమలు

» 19, 21వ తేదీల్లో సేవలకు అంతరాయం

మహబూబ్‌నగర్ టౌన్/నారాయణపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖ నూతన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. వినియోగదారులకు సురక్షిత సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మహబూబ్‌నగర్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తపాలా శాఖ కార్యాలయాల సేవలన్నింటినీ ఒకే ప్లాట్ ఫామ్‌పై అమలు చేయాలని నిర్ణయించారు. అందుకోసం ఐటీ - 2.0 పేరుతో నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సాఫ్ట్‌వేర్ తపాలా సమాచారం భద్రతను పెంచుతుందని చెప్పారు. ఉద్యోగుల పని సామర్థ్యం, నైపుణ్యం పెరగడమే కాకుండా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి.



మహబూబ్‌నగర్ తపాలా శాఖ ప్రధాన కార్యాలయం

తెలంగాణ సర్కిల్ వ్యాప్తంగా..

తపాలా శాఖ నూతన యాప్ ఐటీ-2.0ను ఈ నెల 22వ తేదీ నుంచి తెలంగాణ సర్కిల్ వ్యాప్తంగా అమలు చేయనున్నది. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంతో పాటు, మన రాష్ట్రంలోని హైదరాబాద్ సర్కిల్, నల్లగొండ తపాలా డివిజన్‌లో అమలు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి రాష్ట్రం అంతటా అమలు చేయనున్నారు. మహబూబ్‌నగర్ తపాలా డివిజన్ పరిధిలోని కార్యాలయాల్లో మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల ప్రధాన కార్యాలయాలు, 4 సబ్ డివిజన్ల (మహబూబ్‌నగర్ ఈస్ట్, వెస్ట్, నారాయణపేట, గద్వాల) పరిధిలోని 368 బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల్లో ఐటీ 2.0 సేవలు అందుబాటులోని రానున్నాయి. వీటితో పాటు 42 ఉప తపాలా కార్యాలయాల్లో నూతన యాప్‌ను అమలు చేయనున్నారు. అందుకోసం ఇప్పటికే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు సూపరింటెండెంట్ విజయజ్యోతి తెలిపారు. కొత్త సాంకేతిక విధానాన్ని ప్రవేశపెడుతున్నందున ఈ నెల 19, 21 తేదీల్లో తపాలా సేవలను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు, ఖాతాదారులు గమనించాలని కోరారు. 22వ తేదీ నుంచి నూతన సాంకేతిక సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై విచారణ



అమరచింతలో విచారణకు వచ్చిన కర్నూల్, వనపర్తి జిల్లాల వైద్య అధికారులు

అమరచింత, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలపై వనపర్తి జిల్లా, అమరచింతలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వైద్యాధికారులు గురువారం విచారణ చేపట్టారు. పట్టణానికి చెందిన ఓ గర్భిణి కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్ష చేయించుకొని, ఆ తర్వాత అబార్షన్ చేయించుకున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో కర్నూల్ జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ వై. నాగప్రసాద్‌బాబు, లీగల్ అడ్వైజర్ సుమలత, మీడియా ఎక్స్‌ప్రెషన్ అధికారి శ్రీనివాసులు, వనపర్తి జిల్లా వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మంజుల, డాక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ నరసింహారావులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. వారి వెంట స్థానిక వైద్యులు ఫయాజ్, రూపశ్రీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని వాలీబాల్ అకాడమీలో మెస్ కాంట్రాక్ట్ కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీలో చేరిన 35 మంది క్రీడాకారులకు మెనూ ప్రకారం టిఫిన్, భోజనం, మాంసాహారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందుకోసం ప్రతీ క్రీడాకారుడికి రూ.180 చెల్లిస్తామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బిల్లులను ప్రతీ నెల చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23 లోపు దరఖాస్తులను అందించాలని కోరారు.

గ్రామాల పేరు మార్పు

» బ్రహ్మగిరిగా దోమలపెంట, కృష్ణగిరిగా ఈగల పెంట

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

బ్రహ్మగిరి (దోమలపెంట), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పరిసర ప్రాంతంలో ఉన్న కొండలకు పూర్వం బ్రహ్మగిరి, కృష్ణగిరిగా శ్రీశైలం చరిత్రలో ఉన్నపటికీ 1963లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దోమలపెంట, ఈగలపెంట గ్రామాలుగా పిలువబడ్డాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం దోమలపెంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం దోమలపెంటను బ్రహ్మగిరి, ఈగలపెంటను కృష్ణగిరిగా ప్రభుత్వం అధికారికంగా మార్పు చేసిందన్నారు. దోమలపెంట, ఈగలపెంట గ్రామాలతో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో బోర్డులపై పేర్లు మార్పు చేయాలని ఇప్పటికే కలెక్టర్ నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తాను కూడా అన్ని శాఖల అధికారులకు ఆదేశించానన్నారు. బ్రహ్మగిరిలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. బ్రహ్మగిరి, కృష్ణగిరి, పాతాళగంగ గ్రామాల్లో ఉన్న మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, జూట్ బ్యాగుల తయారీ, స్వగృహ వంటల తయారీ వంటి అవకాశాలు కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిపించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో నిర్మించిన క్వార్టర్స్‌ను నిరుపేదలకు క్రమబద్ధీకరిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసే వారి నుంచి స్థలాలను తిరిగి ఇరిగేషన్ శాఖకు అప్పగిస్తామన్నారు. శ్రీశైలం నుంచి బ్రహ్మగిరి వరకు గతంలో నడిచిన ఆత్మకూర్ డిపో బస్సును తిరిగి పునరుద్ధరించేటట్లు శ్రీశైలం ఎమ్మెల్యేతో మాట్లాడామని, అందుకు వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ, ఎంపీడీవో లింగయ్య, ఐకేపీ ఏపీఎం నిరంజన్, మాజీ సర్పంచ్ చత్రునాయక్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, పూరి శ్రీనువాసులు, నాయకులు హరినా రాయణగౌడ్, మొయిజొద్దీన్ సిరాజ్, రసూల్, గురవయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ కనిపించిన చిరుత

» టీడీగుట్ట సమీపంలోని కొండపై ప్రత్యక్షం

మహబూబ్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు నగర ప్రజలను చిరుత భయాందోళనలకు గురిచేస్తోంది. అధికార యంత్రాంగం ఎంత ప్రయత్నం చేసినా ఆచూకీ లేని చిరుత, రెండు మూడు రోజుల కోసారి ప్రజలకు కనిపిస్తూ భయాందోళనలకు గురి చేస్తోంది. నగరంలోని టీడీగట్టు ఇళ్ళ సముదాయాలకు సమీపంలోని కొండపై గురువారం అది మళ్లీ కనిపించింది. చిరుత ఆచూకీ కోసం అధికార యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు అడవిని జల్లెడ పట్టింది. దానిని బంధించేందుకు బోను ఏర్పాటు చేసినా ఫలితం దక్కలేదు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఉపయోగించినా ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. నాలుగు రోజుల పాటు కనిపించని చిరుత పులి గురువారం మళ్లీ దర్శనం ఇవ్వడంతో ప్రజలు ఆందోళనకు గురవు తున్నారు.



గుట్టపై కనిపించిన చిరుత

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

» నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీ యువకులు డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా వనపర్తి పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని విషయాలను డిజిటల్ లైబ్రరీలో ఆన్‌లైన్లో వినొచ్చని తెలిపారు. ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని విషయాలు డిజిటల్ లైబ్రరీలో పొందుపరిచి ఉంటాయని చెప్పారు. అనంతరం పాఠకులు, విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయంలో తాగునీటి సమస్యను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందిస్తూ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


రాష్ట్రంలోనే తొలి డిజిటల్ లైబ్రరీని వనపర్తిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం భాస్కరరావు, రీజనల్ హెడ్ సత్యనారాయణ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లు రవి, పక్కన ఎమ్మెల్యేతూడి మేఘారెడ్డి , కలెక్టర్ ఆదర్శ్ సురభి

నడి ఊరిలో కొండచిలువ

నారాయణపేటరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నడి ఊరిలోకి కొండచిలువ రావడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. నారాయణపేట మండలంలోని సింగారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన యానగుంది మల్లప్ప ఇంటి సమీపంలోని సందులో చెట్ల మధ్యన గురువారం ఉదయం కొండచిలువ సంచరిస్తుండగా పక్షులు అరిచాయి. దీంతో మల్లప్ప కుమార్తె మల్లమ్మ ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా, పాము కనిపించింది. ఆమె వెంటనే తన సెల్‌ఫోన్‌లో పామును వీడియో తీసింది. విషయాన్ని చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఆ పాము కాలువలో నుంచి చెట్ల పొదల్లోకి జారుకున్నది. ఇది చిన్నదని, ఇంకా పెద్దవి ఉండొచ్చని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి కొండచిలువను పట్టుకొని అడవిలో వదిలేయాలని కోరారు.



చెట్ల పొదల్లోకి వెళ్తున్న కొండచిలువ

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220

ఆలయ దర్శనం



యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎన్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,



అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కోషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్ణిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

మొహం చాటేసిన వర్షం

- సాగు చేసిన పంటలు ఎండు ముఖం
- ఆందోళనలో అన్నదాతలు


నీరు లేక వాడుపడుతున్న పత్తి మొలకలు

గోపాల్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇరవై రోజులుగా వానలు మొహం చాటేశాయి. రూ.లక్షలు పెట్టి పత్తి, మొక్కజొన్న, కందులు, జొన్నలు, మొదలైన ఆరుతడి పంటలు ఈ వానా కాలంలో రైతులు సాగు చేశారు. గతేడాది ఇప్పటికే సమృద్ధిగా వర్షాలు పడి పంటలు కళకళలాడాయి. ఈ ఏడాది ముందస్తు వానలు రావడంతో పంటలు బాగా పండుతాయని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తాము ఒకటి అనుకుంటే విధి ఇంకోటి చేసినట్లు ఇరవై రోజులుగా వానలు కురువకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వాన దేవుడు కరుణించకపోవడంతో వరినాట్లు కూడా ఆలస్యం అవుతున్నాయి. వాతావరణ శాఖ మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని చెబుతుండటంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలు పెట్టిన పెట్టుబడి నేలపాలు అవుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. అప్పుల కుప్పలో పడిపోతామేమోనని భయపడుతున్నారు. వాన దేవుడు కరుణించాలని రైతులు పూజలు చేస్తున్నారు. పది రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగితే మొక్కలు పూర్తిగా ఏడిపోయి చనిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు ఎండుతున్నాయి

రెండు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాను. ఇరువై రోజులుగా వానలు కురువకపోవడంతో పంట కనుల ముందు ఎడిపోతుంటే చాలా బాధగా ఉంది.
- కురుమూర్తి, రైతు

న్యూస్ బాక్స్

అందుబాటులో వరి విత్తనాలు

మదనాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1010 రకం 25 కిలోలకు రూ.710, ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం రూ.670 ఉందని, కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని అధికారులను సంప్రదించాలని కోరారు.

హార్టికల్చర్, పాలిటెక్నిక్ కోర్సులకు రేపు స్పాట్ కౌన్సెలింగ్

పెద్దమందడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి గాను శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కోర్సులలో ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. ఇప్పటికే అప్లికేషన్స్ నమోదు చేసిన, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో శనివారం ఉదయం 10 గంటల లోపు శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ, ములుగు, (సిద్దిపేట జిల్లా)లోని పరిపాలన భవనంలో జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. దరఖాస్తు చేయని విద్యార్థులు సైతం ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావచ్చన్నారు. మరింత సమాచారం కోసం 7780509322, 7683053157 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

పెద్దమందడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోజర్లలో ఉద్యాన కళాశాల వారు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం (యూనిట్-2) ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభంమై గురువారం ముగిసింది. చివరి రోజు ముగింపు కార్యక్రమం చేపట్టారు. వారం రోజుల నుంచి ఈ స్పెషల్ క్యాంపునకి సహకరించిన గ్రామ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.భాస్కర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కె.రామకృష్ణారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ గట్టుమన్యం, పంచాయతీ కార్యదర్శి హకీంపాషలను శాలువాతో సన్మానించారు. బాల్ నాగన్న, జి.రాములు, వెంకటయ్య ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి విద్యావిభాగం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా జిల్లాలోని వివిధ మండలాల్లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బోరెల్లి వెంకటేష్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్, జీహెచ్ఎం పోస్టులకు ప్రమోషన్ షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్, లక్ష్మణ్ నాయక్, వెంకటేష్, రామన్ గౌడ్, బాలరామ్, సాబేర్, తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల ఆరోగ్యానికి ఆసరా సీఎంఆర్ఎఫ్


వనపర్తి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం పేదోళ్ల ఆరోగ్యానికి కొండంత ఆసరా అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్స్ ఇస్తున్నామన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాజేంద్ర ప్రసాద్, చీర్ల జనార్దన్, కమ్మర్ మియా, కిరణ్ కుమార్, ఎండీ బాబా, సమ్మద్ పాల్గొన్నారు.

కొత్తకోట : పట్టణంలో 15 మందికి రూ.4.84 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య యాదవ్, సరేందర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, సలీం, ఎజాజ్ అలీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిన్నంబావి : మండల పరిధిలోని వెలగొండలో కొన్ని రోజుల కిందట మృతి చెందిన కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. శ్రీలతకు, ఈశ్వరమ్మకు రూ.5 వేల చొప్పున అందజేశారు. నాయకులు నాగరాజు, మహదేవ్‌గౌడ్, ఉన్నారు.

వ్యాధుల నియంత్రణ మార్గాలను అన్వేషించాలి


మాట్లాడుతున్న డాక్టర్ అల్లే శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నియంత్రణ మార్గాలను ముందే అన్వేషించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. గురువారం సర్వజన ఆరోగ్య సంచాలకుడిచే నియమించబడిన ప్రత్యేక అధికారి డాక్టర్ సుధాకర్ లాల్ జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌వోలు, జిల్లా ఏఎల్‌వో బృందం సభ్యులు, ప్రైవేటు ల్యాబ్ టెక్నిషియన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి కోరుకునేదే కాంగ్రెస్ పార్టీ

- మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అంటేనే స్లం ఏరియాల నుంచి, గల్లీల నుంచి అభివృద్ధిని కోరుకునేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్నింగ్ వాక్ చేసి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో కలివిడిగా తిరుగుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 19 నెలల్లోనే అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అందులో భాగంగానే పేదలకు రేషన్ కార్డులు ఇవ్వడం, రేషన్ కార్డుతో పాటు సన్నబియ్యం పంపిణీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రజలకు కనీస అవసరాలైన మౌలిక వసతులు కూడా గత ప్రభుత్వం కల్పించలేదని విమర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, లక్కాకుల సతీష్, చీర్ల చందర్, పుట్టపాకల మహేష్, మధుసూదన్‌గౌడ్, రమాదేవి, మన్నెంకొండ, రంజిత్ వాకిటి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ పాలన సాధిస్తుందని పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ షా సాహెబ్ దర్గా ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అందించే విధంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరగాలని అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆత్మకూరు మండల పరిధిలోని రేచింతల, తిప్పడంపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ నూతన భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రహమతుల్లా, పరమేష్, శ్రీనివాసులు, తులసిరాజ్, మణివర్ధన్ రెడ్డి, గంగాధర్ గౌడ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం సందర్శన

వనపర్తి టౌన్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించారు. గురువారం జిల్లా కేంద్రానికి మంత్రి హోదాలో మొదటిసారిగా వచ్చి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను గ్రామాల్లో ఎండగట్టాలి

- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజా పాలన అందిస్తామన్న కాంగ్రెస్ నాయకులు, అధికారం చేపట్టి ప్రజా సంపదను దోచుకుంటున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పరిధిలోని జీవీఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో పలుమార్లు మక్తల్ ఎమ్మెల్యేగా అధికారం చేపట్టి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిపానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వంటి విషయాలను గ్రామాల్లో తెలియపరిచి కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలన్నారు. చిట్టెం సుచరిత, గాయత్రి రవికుమార్ యాదవ్, బంగారు శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, వీరేశలింగం, కోటేశ్వర్ పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

వీపనగండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం వీపనగండ్ల మండలంలోని కల్వరాల, గోవర్ధనగిరి, గోపాల్‌దిన్నె, సంగినేనిపల్లి, వీపనగండ్ల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లోని అయిదు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25 సవరించాలని, శాస్త్రీయ పద్ధతిలో సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. బి.రామచంద్రయ్య, స్వామి, పి.శ్రీనివాసులు, వై.రామకృష్ణ, దేవేంద్రం, యం.కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో అపరిశుభ్రతకు పాల్పడితే జరిమానా


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శశిధర్

ఆత్మకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం, మలమూత్ర విసర్జనలకు పాల్పడితే జరిమానా తప్పదని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ గురువారం పేర్కొన్నారు.ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ ఆత్మకూరు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అందులో భాగంగానే వానకాలం సీజన్‌లో పట్టణ ప్రజలను వ్యాధుల బారినపడకుండా కాపాడేందుకు ప్రత్యేకంగా శుభ్రత పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా పట్టణ ప్రజలు తమ ఇంటి పెరట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించి వార్డు ఆఫీసర్లు బాధ్యతలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పట్టణ ప్రజల వ్యాపారస్తులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించేలా చూడాలని ఆదేశించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రజిని

వనపర్తి విద్యావిభాగం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్, పోక్సో చట్టం గురించి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అవగాహన కల్పించారు. దీంతో పాటు సీపీఆర్ కార్డియో పల్మనరీ రెససిటేషన్ మీద విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సుధాకర్ గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

పెబ్బేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు సుధాకర్ గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని కంచిరావుపల్లికి చెందిన సుధాకర్ గౌడ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. విజయవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రాములు యాదవ్, సురేందర్ గౌడ్, రంజిత్, జగదీశ్వర్ తదితరులున్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పెబ్బేరు, : మండలంలోని ఏటిగడ్డ శాగాపూర్ గ్రామ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి సతీమణి రోడ్డు ప్రమాదంలో గాయపడింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం క్షతగాత్రురాలిని పరామర్శించారు.


మండల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మండలంలో నెలకొన్న అన్ని సమస్యలను మంత్రి వాకిటి శ్రీహరి తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా మండల కేంద్రానికి జూనియర్ కళాశాల రాలేదని అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ ఆసుపత్రిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ్, కృపన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

వనపర్తి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. వివిధ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న యజమానులకు గురువారం ఒక్కరోజే రూ. 12,200 జరిమానాలు విధించినట్లు హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ సాయికృష్ణ, నితీష్ కుమార్, సిబ్బంది భాను, ఆంజనేయులు, అంజి తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో శతాధిక వృద్ధురాలి మృతి


తిరుమలమ్మ (ఫైల్)

అమరచింత, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన చేనేత కార్మికురాలైన శతాధిక వృద్ధురాలు చండపల్లి తిరుమలమ్మ (105) గురువారం మృతి చెందింది. చేనేత కార్మికురాలిగా తుది శ్వాస వరకు ఆమె మగ్గం పని చేస్తూ.. అనారోగ్యంతో మృతిచెందింది. 100 సంవత్సరాల వయసు దాటినా.. ఇంట్లో మగ్గంపై చీరలు నేస్తున్న కుమారుడు, కోడలుకు చేదోడు వాదోడుగా ఉంటూ రాట్నం ద్వారా కండెలు చుట్టి, పోగులు అతికించి ఇచ్చేది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా.. ఓ కుమారుడు ఇది వరకే మృతిచెందాడు. ఆమె మృతికి చేనేత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, గంగాధర్, చంద్రమోహన్, శ్రీను, సంతాపం తెలియజేశారు.

హోంగార్డు అదృశ్యం : కేసు నమోదు

వనపర్తి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన బీచు పల్లి హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 16న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఇంటికి రాలేదని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఆత్మకూరు నాయకులు

ఆత్మకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును ఆత్మకూరు మండల బీజేపీ నాయకులు ఆంజనేయులు, లక్ష్మీకాంత్‌లు మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల అభివృద్ధి, పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని వారు ఆకాంక్షించారు.

సొంత ఖర్చులతో వీధి లైట్లు ఏర్పాటు

వీపనగండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొర్లకుంటలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.గోపాల్‌నాయక్ సొంత ఖర్చులతో గురువారం వీధి లైట్లను ఏర్పాటు చేయించారు.

చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కేపీఎస్ క్యాబినెట్ సభ్యులతో ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తకోట పీపుల్స్ స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించగా.. సాత్విక్, నిఖిల్, పల్లవి, నవ్యశ్రీ, అభిలాష్, బస్వాత్రిశూల్, అశ్విక, తేజేశ్వరి, సుశాంత్, అక్షర, అజయ్ కుమార్, సుకన్య గెలుపొందగా వారిచే ప్రమాణం స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచి విద్యార్థులుగా పాఠశాలలో పేరు తెచ్చుకుంటే తల్లిదండ్రులు ఆనందపడతారన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థులను అభినందించారు. కేపీఎస్ చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వతోనే దోమలు, ఈగల వృద్ధి


ఒకటో వార్డులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : నీటి నిల్వతోనే ఈగలు, దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇంటి పరిసరాల చుట్టూ నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 1వ వార్డులో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రోజు వారీగా వాడుకునే నీటిని నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ భూపాల్, సిబ్బంది అశోక్, వార్డు ఆఫీసర్లు పావనితో పాటు ఆర్‌పీలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పేదోడి ఇంటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదోడి ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ అన్నారు. గురువారం పట్టణంలో 2, 14, 15వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణానికి మొదటి విడత మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే రెండో విడత మరికొంత మందికి మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, మిషక్, రవీందర్ రెడ్డి, సుభాష్, సాయిలు యాదవ్, బాలరాజు యాదవ్, వెంకటేష్, భాస్కర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం


అంతర్జాతీయ న్యాయ దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వనపర్తి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అన్యాయం జరగకూడదన్న సూత్రమే న్యాయ వ్యవస్థకు పునాది అని తెలుగు భాషోపాధ్యాయుడు గిరిరాజాచారి అన్నారు. గురువారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 100 మంది దోషులు తప్పించుకున్నా.. పర్వాలేదు కాని, ఒక్క అమాయకుడికి కూడా అన్యాయం జరగవద్దని న్యాయం చెబుతుందని అన్నారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐ.సీ.సీ) 2008 జూలై 17న ఏర్పడిన సందర్భంగా ఈ రోజును అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకొంటారని అన్నారు. సంజీవయ్య, ఉపాధ్యాయులు సిద్ధి రవి, వరదాచారి, రుద్రమదేవి, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో జేఈఈ, నీట్ తరగతులు ప్రారంభం

వనపర్తి విద్యావిభాగం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీట్, జేఈఈ, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వారి నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభమైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ విద్యార్థులకు నీట్, ఎంపీసీ విద్యార్థులకు జేఈఈ, ఆర్ట్స్ విద్యార్థులకు క్లాట్ వంటి తరగతులు గురువారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభమయ్యాయని, కళాశాలలో రెగ్యులర్‌గా జరిగే తరగతులతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులు కూడా ప్రతీ రోజు ఇంటర్ బోర్డు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏదైనా కారణం చేత ఆన్‌లైన్ లవ్ క్లాసులకు విద్యార్థులు హాజరు కాలేని పక్షంలో రికార్డెడ్ వీడియోస్‌ను కూడా చూసే సదుపాయం ఉందన్నారు.

ఈ కోచింగ్‌తో వేల మంది ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ చౌరస్తాలో పండుగ సాయన్న జయంతిని బీసీ కులాల వేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ కులాల వేదిక అధ్యక్షుడు రాములు యాదవ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం సాయన్న పోరాటం చేసి గోల్కొండను రాజ్యంగా ప్రకటించుకుని పరిపాలన కొనసాగించాడన్నారు. బీఎస్పీ దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జి జనంపల్లి వినోద్ కుమార్, వెంకటన్న గౌడ్, నరేందర్ సాగర్, బాలు, కిషన్ నాయక్, భాస్కర్, మహేష్, గంగాధర్, రాములు, లక్ష్మీపంతులు, భాస్కర్ నాయి తదితరులు పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య అర్చక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బుసిరెడ్డిపల్లి వాసి

పాన్‌గల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాన్‌గల్ మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లికి చెందిన శఠగోపం శ్రీనివాసాచార్యులను నియమించారు. గురువారం హైదరాబాద్‌లో కొనసాగిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంతాచారి ఆదేశానుసారం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన్ శర్మ, శఠగోపం శ్రీనివాసాచార్యులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ నియామక పత్రాన్ని వరంగల్ వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ ధూప దీప నైవేద్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం జరిగిందని ఆయన తెలియజేశారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాల పంపిణీ

వీపనగండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు హైదరాబాద్ బార్ కౌన్సిల్ పని చేస్తుందని బోర్ కంపెని సెంబర్ కొండారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాల గోవర్ధనగిరి పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బాలికల పాఠశాలలో నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంఈవో నరసింహా, బార్ కౌన్సిల్ సభ్యులు శ్యామ్ కుమార్, నరేన్‌రాజా, అశోక్‌కుమార్, ఎండి భాష, రఘునందన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.